గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో హౌసింగ్ డిపార్ట్‌మెంట్ తరఫున జరుగుతున్న గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, జెడ్పీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం హౌసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇతర మెటీరియల్స్, ఆర్థికపరమైన అంశాల్లో శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు లే అవుట్లకు ప్రత్యేక అధికారులుగా ఉండి గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రతివారం జిల్లా స్థాయిలో పురోగతిపై సమీక్షిస్తానని తెలిపారు. స్థల, ఆర్థిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. లబ్ధిదారుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఉంటే వారికి అందాల్సిన ఆర్థిక సహాయాన్ని బ్యాంకుల ద్వారా మంజూరు చేయాలన్నారు. వంద రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. మండలాల వారీగా పరిస్థితిని సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలీ, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, డ్వామా పీడీ వందర్‌మాన్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, హౌసింగ్ ఈఈలు శ్రీనివాసప్రసాద్, దశరథ శర్మ, డీఈలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

● విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఎండీ సుప్రీతారెడ్డి



నూతనంగా ప్రారంభించిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్

ఒంగోలు టౌన్: దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలలో గత 40 సంవత్సరాలుగా విశేష వైద్య సేవలు అందిస్తున్న విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌పై కోట్లాది మందికి ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆ సంస్థ ఎండీ, సీఈఓ సుప్రీతారెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని 60 అడుగుల రోడ్డులో శుక్రవారం కొత్త బ్రాంచిని ప్రారంభించిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. దేశంలోనే విజయా డయాగ్నోస్టిక్ సెంటర్ అతి పెద్ద చైన్ సంస్థ అని, 25 నగరాలలో 160 కేంద్రాల నెట్‌వర్క్ కలిగి ఉందని తెలిపారు. 300 మందికిపైగా వైద్యులు నిరంతరాయంగా రేడియాలజీ, పాథాలజీ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఒంగోలులో నూతనంగా ప్రారంభించిన కేంద్రంలో ఆధునాతన ఇమేజింగ్ కోసం హైస్పీడ్ 3 టెస్లా ఎంఆర్ఐ, వివరణాత్మక కార్డియాక్ అసెస్‌మెంట్ల కోసం 160 స్లైస్ కార్డియాక్ సిటీ, డెంటల్ సిబిసిటి సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే, బోన్ డెన్సిటోమెట్రీ, డిజిటల్ ఎక్స్‌రే వంటి అత్యంత ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అల్ట్రా సోనోగ్రఫీ, ఈసీజీ, స్ట్రెస్ టీఎంటీ, 2డీ ఎకో, పీఎఫ్‌టీ, ఆధునిక లేబొరేటరీ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి డయాగ్నోస్టిక్ సేవలను ఒంగోలు ప్రజలకు అందించే లక్ష్యంతో నూతన బ్రాంచి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోగొట్టు కొనిన డాక్యుమెంట్ కొరకు పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ పోగొట్టు కొనిన డాక్యుమెంట్ కొరకు వారు పేర్కొన్న వివరముల ప్రకారము ఈ నోటీసు ఇవ్వబడినది. క్రింది షెడ్యూల్ ఆస్తిని నా క్లయింట్లు 1.శిఖాకొల్లి సవరాజు కృష్ణ అతని భార్య శిఖాకొల్లి స్వాతి లక్ష్మి లు 13/06/2022 న విక్రయ దస్తావేజు నెంబర్ 6580/2022 ఎస్ఆర్ఓ ఒంగోలు ద్వారా తాళ్లూరి బాలసరోజిని నుండి కొనుగోలు చేసి వున్నారు. వాస్తవముగా షెడ్యూల్ ఆస్తి పల్లమోతు సురేంద్రబాబు 11/5/1984 న తమ్ములూరి రామావధాని నుండి విక్రయదస్తావేజు నెంబర్ 1667/1984 ఎస్ఆర్ఓ ఒంగోలు ద్వారా కొనుగోలు చేసి తదనంతరము సదరు ఆస్తిని 06/02/2003 న విక్రయదస్తావేజు నెంబర్ 448/2003 ఎస్ఆర్ఓ ఒంగోలు ద్వారా తాళ్లూరి వరలక్ష్మమ్మ కు అమ్మివేసినారు. సదరు తాళ్లూరి వరలక్ష్మమ్మ మరణము తరువాత ఆమె ఏకైక కుమారుడు తాళ్లూరి భాస్కర రావు సదరు ఆస్తిని అతని భార్య తాళ్లూరి బాల సరోజినికి 13/06/2009 న సెటిల్మెంట్ దస్తావేజు నెంబర్ 4098/2009 ఎస్ఆర్ఓ ఒంగోలు ద్వారా చెందచేసారు. తదనంతరము సదరు బాల సరోజినీ నుండి నా క్లయింట్లు దిగువ షెడ్యూల్ ఆస్తిని విక్రయదస్తావేజు నెంబర్ 6580/2022 ఎస్ఆర్ఓ ఒంగోలు ద్వారా కొనుగోలు చేసినారు. సదరు ఆస్తి యొక్క పైన తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్ లతో నా క్లయింట్ మోటారు సైకిల్ మీద ఒంగోలు మంగమూరు రోడ్ నందు ప్రయాణములో ఒరిజినల్ లింక్ దస్తావేజు నెంబర్ 1667/1984 మోటార్ సైకిల్ నుండి క్రింద పడి పోయినది. సదరు విషయమును నా క్లయింట్లు ఆలస్యముగా గుర్తించారు. తరువాత సదరు డాక్యుమెంట్ నెంబర్ 1667/1984 కొరకు వెతికినను దొరకలేదు. కనుక సదరు డాక్యుమెంట్ దొరికిన వారు క్రింద తెల్పిన అడ్రస్ కు డాక్యుమెంట్ ని అందజేయవలసినదిగా కోరుతున్నాను.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా, ఒంగోలు ఎస్ఆర్ఓ, ఒంగోలు టౌన్, [illegible], ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, 3వ వార్డ్, 1వ బ్లాక్, టి.యస్. నెంబర్. 9, ప్లాట్ నెంబర్ 24, 125 చదరపు గజముల ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు : షేక్ [illegible] ఆస్తి, దక్షిణము : ప్లాట్ నెంబర్ 25 స్థలము, పడమర : 18 అడుగుల వెడల్పు రోడ్ ఉత్తరము: ప్లాట్ నెంబర్ 23 ఆస్తి.

R.S.H.V.S.Dattu, B.Com,BL.,
Advocate, Kothapeta 3rd Line,
Ongole - 523 001, Mob.No.96661 59499.

క్విట్ కార్పొరేట్ ఉద్యమం చేయండి



నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మాబు

మద్దిపాడు: బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమివేయడానికి క్విట్ ఇండియా అంటూ ఏ విధంగా మన దేశ నాయకులు నినదించారో.. అదే విధంగా మతోన్మాదులను, కార్పొరేట్ సంస్థలను దేశం నుంచి తరిమికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. కిసాన్ సంయుక్త మోర్చ పిలుపులో భాగంగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, వ్యవసాయానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు వ్యవసాయానికి బడ్జెట్‌లో ఇచ్చే సబ్సిడీలు తగ్గించాయని, దీనివలన రైతులపై అదనపు భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి కంపెనీలను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం స్వాగతం చెబుతోందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టి లబ్ధిపొందడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. కార్మిక చట్టాలను సవరించి వాటిని కార్పొరేట్లకు చుట్టాలుగా మార్చుతోందని, దీని వలన కార్మికులకు భారం పెరుగుతోందని అన్నారు. ఈ విషయాలను కప్పిపుచ్చుకునేందుకు మతోన్మాదాన్ని ప్రజలకు ఎక్కించే విధంగా మోదీ చర్యలు ఉన్నాయని విమర్శించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ మండల నాయకులు కనపర్తి సుబ్బారావు, వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే ఖాసిం, ఉబ్బా ఆదిలక్ష్మి, కాపు సుబ్బారావు, చిన్న అప్పల హనుమంతరావు, చలంచర్ల కృష్ణారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాల్లోకి ఆహ్వానిస్తున్న కార్పొరేట్ కంపెనీలను తరిమికొట్టాలని కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు పిలుపునిచ్చారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నినాదం కార్యక్రమాన్ని శుక్రవారం నాగులుప్పపాడులో నిర్వహించారు. రైతు సంఘ నాయకులు జయంత్‌బాబు, తూబాటి శ్రీకాంత్, బసవ పున్నయ్య, శ్రీరామమూర్తి, స్వర్ణ కిట్టమ్మ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన భక్తిభావం




అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



రాజరాజేశ్వరి అమ్మవారు

● భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
● ప్రజలతో కిటకిటలాడిన దేవాలయాలు
● పలు దేవాలయాల్లో సామూహిక కుంకుమ పూజలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఒంగోలు నగరంలోని దేవాలయాలకు భారీగా భక్తులు చేరుకుని పూజలు నిర్వహించారు. పలు దేవస్థానాల్లో భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక గంటాపాలెంలోని పార్వతీ అమ్మవారికి, బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మకు, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో రాజరాజేశ్వరి అమ్మవారికి, కేశవస్వామిపేట లలితా ఆశ్రమంలో లలితా అమ్మవారికి, గద్దలగుంట బుర్ర బావి దగ్గర మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లకు, చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర రాజలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సమతానగర్ కాలువ దగ్గర వెలసి ఉన్న కనక దుర్గ అమ్మవారికి, కమ్మపాలెంలోని కాళికా అమ్మవారి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రి అమ్మవారికి, రంగారాయుడు చెరువు దగ్గర కంచి కామాక్షమ్మ దేవస్థానంలో, పెళ్లూరు జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో జ్వాలాముఖి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర బాలాత్రిపుర సుందరీదేవి కళారానికి, మంగమూరు రోడ్డులోని శివప్రసాద్‌కాలనీలో పోలేరమ్మ దేవస్థానంలో, నీలంపాలెంలోని అంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాగర్పమ్మ, గద్దలగుంటలోని మహాలక్ష్మి దేవస్థానంలో, మంగమూరు రోడ్డులోని అఖిలానంద ఆశ్రమంలో, మిలటరీ కాలనీ యానాది సంఘంలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్ల మూలవిరాట్లకు అభిషేకాలు, పుష్పాలంకరణ, శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాల, భక్తులకు సామూహికంగా కుంకుమార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులతో అమ్మవారి దివ్య దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానాల పాలకవర్గ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సంక్షిప్తంగా

ఒంగోలు ఇన్‌చార్జి ఉపవిద్యాశాఖ అధికారిగా సుబ్బారావు

ఒంగోలు: ఒంగోలు ఇన్‌చార్జి ఉపవిద్యాశాఖ అధికారిగా మైనంపాడు డైట్ లెక్చరర్ ఎస్.సుబ్బారావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉప విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అనిత రోజ్‌రాణి అనారోగ్యంతో సెలవు పెట్టడంతో తాత్కాలికంగా సుబ్బారావుకు బాధ్యతలు అప్పగించారు. డైట్ కాలేజీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూనే ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. అనితరోజ్ రాణి తిరిగి విధుల్లో చేరేంత వరకు ఈ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.

ఎల్‌ఐసీని దెబ్బతీసేందుకు మోదీ కుట్ర

ఒంగోలు సెంట్రల్: ఎల్‌ఐసీని దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు క్విట్ ఇండియా డే స్ఫూర్తితో ఉద్యమించాలని ఎల్‌ఐసీ ఏజెంట్ల యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా ఒంగోలులోని ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌సీఏఓఐ) ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.బాలచంద్రం, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎల్‌ఐసీలో ఐపీఓను ఉపసంహరించాలని, ఎల్‌ఐసీలోకి కార్పొరేట్ల ప్రవేశాన్ని నిషేధించాలని, ఎల్‌ఐసీ డబ్బుతో కొన్న ఐడీబీఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నూతన ఎల్‌ఐసీ బిల్లును ఉపసంహరించాలని కోరారు. పాలసీదారులు, ఏజెంట్లు, ఎల్‌ఐసీ సంస్థకు నష్టం కలిగించే ఐఆర్‌డీఏఐ నూతన ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలన్న డిమాండ్లతో పోరాటాలను ఉధృతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) నాయకులు సంఘీబావం తెలిపారు.

యూనియన్ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, నాయకులు ఆర శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బీవీ రమణయ్య, కె.రమణారెడ్డి, డి.మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు ట్యూషన్ సెంటర్ ప్రారంభం

కొత్తపట్నం: సర్వేప్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన పిల్లలకు ట్యూషన్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.జగన్నాథరావు, స్థానిక తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు ప్రారంభించారు. అనంతరం సర్వేప్ సంస్థ వారు ఉచితంగా టెస్ట్ బుక్స్, కథలు, నవలలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ అర్జున్‌రెడ్డి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్యాంబాబు

చీమకుర్తి: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి, సీనియర్ సివిల్ జడ్జి కే శ్యాంబాబు అన్నారు. శుక్రవారం బక్కిరెడ్డిపాలెం గిరిజన కాలనీలో స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పలువురు సీఐలు బదిలీ

ఒంగోలు టౌన్: జిల్లాలోని పలువురు సీఐలు శుక్రవారం బదిలీ అయ్యారు. ఒంగోలు ట్రాఫిక్ సీఐగా వై.పాండురంగారావును బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన రేంజ్ వీఆర్‌లో ఉన్నారు. పామూరు సీఐ ఎం.రామానాయక్‌ను గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు బదిలీ చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ఏ వెంకటరమణను వెంకటగిరి సర్కిల్‌కు బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా దర్శి సీఐగా బాధ్యతలు చేపట్టిన వై.రామారావు ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పేద విద్యార్థినికి సాయం

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన పేద విద్యార్థిని నసీమా 10వ తరగతిలో 567 మార్కులు సాధించింది. ఆమెకు ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటు వచ్చింది. చదువుకోవాలని ఉన్నా చేతిలో డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మార్లెళ్ల శ్రీనివాస్, నత్తల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘ జాతీయ కార్యదర్శిగా గౌస్

ఒంగోలు సెంట్రల్: జాతీయ మానవ హక్కుల సంఘ కార్యదర్శిగా, జాతీయ అవినీతి నిరోధక మండలి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యదర్శిగా డాక్టర్ షేక్ గౌస్‌ను నియమిస్తూ ఆ సంస్థల చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ ఆంథోనిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత జాతీయ మానవ హక్కుల సంఘంలో రాష్ట్ర అధ్యక్షుడిగా, నవోదయ మానవ హక్కుల సంఘ చైర్మన్‌గా డాక్టర్ గౌస్ కొనసాగుతున్నారు. పలు అవార్డులు కూడా గతంలో అందుకున్నారు. సామాజిక సేవల పట్ల మక్కువ చూపడం ఇష్టమని, తనపై నమ్మకం ఉంచి ఉన్నత బాధ్యత ఇచ్చిన ఆంథోనీరాజ్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

రిలయన్స్ ఫౌండేషన్ సేవలు ఉపయోగకరం



పాడి రైతులకు దాణా అందిస్తున్న ఏడీఏ నాగభూషణం

నాగులుప్పలపాడు: రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో పశుపోషకులకు మేలు చేయడం చాలా మంచి కార్యక్రమం అని పశుసంవర్ధకశాఖ ఏడీఏ నాగభూషణరావు అన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా శుక్రవారం మాచవరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 15 పశువులకు ఎద ఇంజక్షన్లు, ఎల్‌ఎస్‌డీ వ్యాక్సిన్ అందించారు. 65 మంది పశుపోషకులకు ఉచితంగా మినరల్ మిక్చర్, మందులు అందించారు. అనంతరం పశుసంవర్ధకశాఖలో అమలవుతున్న పథకాలు, పశువుల్లో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు ఏడీఏ నాగభూషణరావు వివరించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం సపోర్టర్ ప్రేమ్‌కుమార్, సహాయకులు ఉషశ్రీ, శైలజ, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మెరుగైన ఫలితాలు

కొత్తపట్నం (ఒంగోలు సెంట్రల్): అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారులతో మెరుగైన వ్యాయామం చేయించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డాక్టర్ అశోక్ అన్నారు. కొత్తపట్నం ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం సుహరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిజియో సైకిల్ అందించారు. 40 మంది విద్యార్థులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. డాక్టర్ అశోక్ మల్టీ పౌడర్, మల్టీ విటమిన్ టాబ్లెట్లు అందించారు. విద్యార్థులకు స్వీట్లు, బ్రెడ్ అందించారు. ఇస్మాయిల్ బేకరీ అధినేత తాహిద్, భువనేశ్వరి, కళ్యాణి, ఆదిలక్ష్మి సహకారంతో చిన్నారులకు అభ్యసన సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1, 2 తులసీకుమారి, పద్మావతి, హెచ్‌ఎం అనిల, ఉష, వెంకటరెడ్డి, ఐఈడీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సుహరి ఫౌండేషన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్ ఉండకూడదు

నాగులుప్పలపాడు: గ్రామ సచివాలయాల ద్వారా, మీ సేవ ద్వారా వచ్చిన ప్రజల దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉప్పుగుండూరు గ్రామ సచివాలయాన్ని పరిశీలించిన ఆర్డీవో.. అక్కడి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా వచ్చే ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడి ప్రస్తుతం చాలా ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇకపై పరిష్కారమయ్యే ఫైల్స్‌లో జాప్యం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

